సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 02 | సంచిక : 104 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | గురువారం | 14.08.2025



## పెళ్లికుమారుడికి వరద పాట్లు

- మోసుకెళ్లి వాగు దాటించిన బంధువులు

2 లో



# ఓరుఘోల్లుమంది

- చిన్నపాటి చినుకులకే మహానగరం మునక
- భారీ వర్షమైతే పరిస్థతి ఏంటీ?

వాన పేరు వింటేనే వరంగల్ నగరం వణికిపోతోంది.చిన్నపాటి చినుకులకే నగరంలోని కాలనీలు నీట మునిగి పోయాయి. పేరుకే గ్రేటర్ వరంగల్ కానీ.. ఇక్కడ సౌకర్యాలు మాత్రం అంతంతే.. మహానగరంలోని గుడిసెవాసుల కాలనీలు ఏటా నీటమునగడం సాధారణం అయిపోయింది. నగరంలో ఓ గంట పాటు వర్షం పడితే చాలు ప్రధాన రహదారులన్నీ మునిగిపోవడం ఖాయం. నీట మునిగిన ప్రాంతాల ప్రజల బాధలు వర్ణనాతీతం. గత అనుభవాలు మరిచిపోలేక.. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక బిక్కుబిక్కు మంటూ కాలం వెళ్లదీస్తున్నారు.

*- వరంగల్, మన చౌరాస్తా*

3 లో



## నమ్మించి.. వంచించి..

- యువతిపై గ్యాంగ్ రేప్.. పది మంది నిందితుల అరెస్టు

3 లో

## అలర్ట్‌గా ఉండండి

2 లో

- జిల్లా అధికారులకు కలెక్టర్ రిజ్వాన్ బాషా ఆదేశాలు జారీ
- కొడకండ్ల విస్తృత పర్యటన





# పెళ్లి కుమారుడికి వరద పాట్లు..

- మోసుకు తీసుకెళ్లిన బంధువులు
- ఉధృతంగా ప్రవహిస్తున్న గన్నేరువరం వాగు

**గన్నేరువరం, మన చౌరాస్తా :** కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండల కేంద్రం గన్నేరువరం ఊర చెరువు మత్తడి ప్రవాహం ఎక్కువై రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో మండల కేంద్రంలో పెళ్లికి చేరుకోవలసిన పెళ్లి కొడుకు పాట్లు తప్పలేదు. వరద ఉధృతికి వాహనం నిలిపివేశారు. నాలుగు గంటల వేచి చూసి విధి లేని పరిస్థితిలో బంధువులు పెళ్లికొడుకును భుజాలపై మోసుకుంటూ అవతలి ఒడ్డుకు చేర్చి మరో వాహనంలో తీసుకొని వెళ్లారు. లో లెవెల్ కల్వర్టు సమస్యతో గన్నేరువరం మండల ప్రజలు ప్రతి సంవత్సరం ఇలాంటి ఇబ్బందులే ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని మండల ప్రజలు వేడుకుంటున్నారు.





# అధికారులు అలర్ట్‌గా ఉండాలి

- వర్షా ల నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టాలి
- కొడకండ్ల మండలంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా పర్యటన
- ఫర్టిలైజర్ షాపులు, పీహెచ్‌సీ, ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన



**కొడకండ్ల, మన చౌరాస్తా :** భారీ వర్షాల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అలర్ట్ గా ఉండాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. బుధవారం జిల్లాలోని కొడకండ్ల మండలంలో విస్తృతంగా పర్యటించారు. ముందుగా రామారం చెరువును పరిశీలించి... భారీ వర్షాలు కురిసి చెరువు నిండితే తీసుకోవాల్సిన చర్యలుపై పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. అనంతరం మండలంలోని పలు ఫర్టిలైజర్ షాపులను, పీఏసీఎస్‌ను సందర్శించి ఇప్పటి వరకు జరిగిన అమ్మకాల వివరాలను, స్టాక్ వివరాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. రైతుకు ఉన్న ఎకరాలను బట్టి యూరియాను అమ్మాలని, అవసరాని కంటే ఎక్కువ యూరియాను అమ్మి కొరతను సృష్టించవద్దని ఆదేశించారు. జిల్లాలో సాగుకు సరిపడా యూరియా ఉన్నదని, దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పీహెచ్‌సీని సందర్శించి అటెండెన్స్ రిజిస్టర్ ప్రకారంగా సిబ్బంది ఉన్నారా లేదా అని తెలుసుకున్నారు. అనంతరం వైద్యాధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అలర్ట్ గా ఉండాలని 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండాలని సూచించారు. వర్షాల నేపథ్యంలో మరింత అలర్ట్ గా ఉండాలని, సమయానికి వైద్య సేవలు అందించాలన్నారు. చివరిగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి ఇసుక, మొరం, కంకర తదితర మెటీరియల్ సమస్యలు ఏమైనా ఉన్నాయా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం లింగాలఘణపురం మండలంలోని కుందారం బ్రిడ్జ్ మీద నుంచి భారీ వాహనాలు వెళ్లేందుకు వీలుగా జరుగుతున్న పనులను కూడా కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, వ్యవసాయ, వైద్య తదితర శాఖల అధికారులు ఉన్నారు.



# ఇందిరమ్మ కాలనీకి బీటీ రోడ్డు వేయాలి



**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పట్టణంలోని రైల్వే అండర్ బ్రిడ్జి ఎల్లంల ఆటో అడ్డ నుంచి బాణాపురం ఇందిరమ్మ కాలనీ, ఏసిరెడ్డి నగర్ డబుల్ బెడ్ రూమ్ కాలనీ వరకు 40 ఫీట్ల బీటీ రోడ్డు వేయాలని సీపీఎం జనగామ జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గోపి డిమాండ్ చేశారు. బుధవారం బాణాపురం ఇందిరమ్మ కాలనీ, వెంకటేశ్వర్ల, ఆంజనేయ, అయ్యప్ప స్వామి గుడి ముందర నుంచి బాణాపురం ఇందిరమ్మ కాలనీ వరకు గుంతల మయమైన రోడ్డును పరిశీలించారు. బురద మయంగా ఉన్న రోడ్డుపై నాట్లు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాణాపురం శాఖ కార్యదర్శి ధరవత్ మహేందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గోపి మాట్లాడుతూ జనగామ పట్టణంలోని 30 వార్డులకు సంబంధించిన పేద ప్రజలందరికీ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఫేస్ వన్ ఫేస్ టు ఫేస్ త్రీ అలాగే కలెక్టర్ ఆఫీస్ నిర్మాణంలో ఇల్లు కోల్పోయిన ఏసిరెడ్డి నగర్ గుడిసె వాసులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టి ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కాలనీల ప్రజలు ప్రధానంగా ఉపయోగించుకున్న రహదారి మొత్తం గుంతల మయమైందని, దానివల్ల తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ దారి గుండా మండలంలోని 10 గ్రామాల వందలాది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తారని తెలిపారు. అలాగే బాణాపురంలో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక వసతులైన అంతర్గత రోడ్లు, వీధి దీపాలు, మోరీలు, కుక్కల సమస్య తదితరాలు పరిష్కరించాలని కోరారు. కలెక్టర్ తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని లేకుంటే ఈ ప్రాంత ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సుంచు విజయేందర్, నాగరాజు, వసంత, ట్ల రేణుక, మమత, నరసయ్య, నీల, పద్మ, కుమారి, అపర్ణ, లక్ష్మి, శ్రీనివాస్, కొమురయ్య, ఆర్య, ఓధ్య నాయక్ పాల్గొన్నారు.



# మహనీయులారా.. మన్నించండి..

- మూలన పడేసిన 'మహనీయుల చిత్రపటాలు'
- నర్మెట తహసీల్దార్ కార్యాలయంలో ఘటన

**నర్మెట, మన చౌరాస్తా :** గోడలపై గౌరవప్రదంగా ఉండాల్సిన మహనీయుల చిత్రపటాలు ఓ గదిలో మూలన పడేసిన తీరు అందరినీ కలిచివేసింది. నర్మెట మండల తహసీల్దార్ కార్యాలయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఆఫీస్‌లో ఓ గదిలో పడి ఉన్న మహనీయుల ఫొటోలను చూసి జనగామ విద్యా సామాజిక పౌర సేవా సంస్థ వ్యవస్థాపకుడు మొహమ్మద్ థఫ్జిల్ చూసి ఆవేదన వ్యక్తం చేశారు. దుమ్ము, తుప్పు పట్టిన పరికరాల పక్కన చింపబడ్డ కాగితాల మధ్య ఈ మహనీయుల చిత్రాలు ఉండటం చూసి మండి పడ్డారు. మన దేశం కోసం ఎన్నో తాగ్యాలు చేసిన వారిని ఇలా అవమానించడం బాధాకరం అన్నారు. ఫొటోలు ఇలా మూలన పడేయడం కేవలం నిర్లక్ష్యం కాదు, మన చరిత్రను, విలువలను మర్చిపోవడమే అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం దగ్గర్లో ఉన్న ఈ సమయంలో ఇలాంటి పరిస్థితి సమాజానికి తప్పు సందేశం ఇస్తుందన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, ఈ చిత్రాలను గౌరవప్రదమైన స్థలంలో అమర్చాలి కోరారు.



# లిక్కర్ లారీ బోల్తా..

- రెండు వేల పెట్టెల బీర్లు నేలపాలు

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** లిక్కర్ లారీ బోల్తాపడి 25 లక్షల విలువగల రెండు వేల పెట్టెల బీర్లు నేల పాలైన సంఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరు గ్రామ శివారు సమ్మక్క సారలమ్మ కల్వర్టు వద్ద చోటుచేసుకుంది. సంగారెడ్డి నుంచి బయలుదేరిన రూ.25 లక్షల విలువగల బీర్ల లోడుతో వెళ్తున్న లారీ హనుమకొండ ప్రధాన రహదారి ముల్కనుడు సమ్మక్క సారలమ్మ కల్వర్టు వద్దకు రాగానే కల్వర్టును ఢీకొని బోల్తా పడింది. బుధవారం వేకువజమన ప్రమాదం జరగడంతో సమాచారం అందుకున్న ఎక్సైజ్ శాఖ అధికారులు పోలీసుల సమన్వయంతో పరిస్థితులను చక్కబెట్టారు. ఇంత పెద్ద ప్రమాదం జరిగినప్పటికీ డ్రైవర్ క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు. కాజీపేట ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్, ఎస్ఐ తిరుపతి ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



# ఈనెల 20 నుంచి లక్కాకులమ్మ బ్రహ్మోత్సవాలు

భీమదేవరపల్లి, మన చౌరాస్తా : హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ గ్రామంలో ఈనెల 20 నుంచి 22 వరకు లక్కాకులమ్మ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు కుక్కముడి ప్రభుదాస్ తెలిపారు. బుధవారం గట్లనర్సింగాపూర్ గ్రామంలో కోదండ రామాలయం వద్ద లక్కాకులమ్మ జాతర వాల్ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20వ తేదీన మహాగణపతి పూజ, అమ్మవారికి పంచామృతాభిషేకాలు, అలంకరణ, శక్తిహోమం, అఖండ దీపారాధన, బోనం సమర్పణ, 21వ తేదీన అమ్మవారికి అష్టోత్తర సహస్ర నామార్చన, అభిషేకం, కుంకుమ పూజలు, ముడుపులు సమర్పించుట, 22వ తేదీన ప్రత్యేక ముడుపులు సమర్పించే కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సంతాన సౌభాగ్యానికి ప్రతీక మాత్రమే కాకుండా కోరిన కోరికలు తీర్చే అమ్మవారిని దర్శించుకొని ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు. గుట్టపైన గుహలో కొలువుదీరిన లక్కాకులమ్మ అమ్మవారిని భక్తులు దర్శించుకొనేందుకు పూర్తి సదుపాయాలు కల్పించామని వెల్లడించారు. కార్యక్రమంలో లక్కాకులమ్మ జాతర ధర్మకర్తలు మండల రవీందర్, చల్లూరి రవీందర్, రాంపల్లి రాజవీరాచారి, గడల రాజయ్య, గుణ్ణపు కొమురయ్య, నీలిగొండ వీరస్వామి, బామండ్లపల్లి కనుకయ్య, మంద శ్రీధర్, బామండ్లపల్లి ప్రభాకర్, మంత్రి కుమారస్వామి, సంగ సుధాకర్, సట్ల శ్రీనివాస్, రాచర్ల శివ, ఏనుగు మధు తదితరులు పాల్గొన్నారు.










# చేర్యాలలో తిరంగా యాత్ర



**చేర్యాల, మన చౌరాస్తా :** రాష్ట్ర పార్టీ ఆదేశాల ప్రకారం బీజేపీ జనగామ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్ సూచన మేరకు చేర్యాలలో బుధవారం తిరంగా యాత్ర నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు వడ్లకొండ సంజీవులు గౌడ్, పట్టణ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. జాతీయ భావ స్ఫూర్తి ప్రతి వ్యక్తి పెంపొందించుకోవాలని, జాతి పట్ల వినయ, విధేయత, ప్రేమా భీమానాలు ప్రదర్శించాలన్నారు. ర్యాలీలో ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాల ల విద్యార్థులు, రాష్ట్ర కౌన్సిలింగ్ మెంబర్ నర మహేందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ఉమారాణి, మండల ప్రధాన కార్యదర్శి తోట బాలరాజు, కాశెట్టి పాండు, మన్నె సత్య వర్ధన్, మడికొండ శ్రీనివాస్ రావు, మాచర్ల ప్రవీణ్ గౌడ్, నిమ్మ మహేందర్ రెడ్డి, పూర్మ సంజీవ రెడ్డి, పోనబోయిన అనిల్, పార్టీ మండల కార్యదర్శి సత్యనారాయణ, బర్మా శ్రీనివాస్, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, ముత్యాల శ్రీనివాస్, కొట్టే చంద్రమౌళి, పంగ సిద్ధులు, కాలకుంట మహేష్, చిన్నమల్ల రాజు, బండకింది అనిల్ తదితరులు పాల్గొన్నారు.



# యువతిపై గ్యాంగ్ రేప్

- 10మంది యువకుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఏసీపీ చేతన్ నితిన్

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ పట్ భణానికి చెందిన ఓ యువతిని ప్రేమిస్తున్నట్లు నమ్మించి శారీరకంగా వాడుకుని, ఆపై తన స్నేహితులతో కలిసి గోవా ట్రిప్ పేరుతో తీసుకెళ్లి సామూహిక అత్యాచారం చేసి వంచించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సామూహిక అత్యాచారానికి పాల్పడిన 10 మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం జనగామ ఏసీపీ పండరి చేతన్ నితిన్ విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలు వెల్లడించారు. జనగామ పట్టణానికి చెందిన ఓ యువతిని ఓయువకుడు ప్రేమిస్తున్నట్లు నమ్మించాడు. ఆపై ఆమెను శారీరకంగా వాడుకున్నాడు. ఆ తరువాత యువతిని మరింత నమ్మించి, గోవాకు వెళుదామని చెప్పి కారులో తీసుకెళ్లాడు. తన స్నేహితులు 10 మందిని పిలిపించుకుని సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ యువతి జనగామకు వచ్చిన తరువాత తన చిన్నమ్మకు తెలుపడంతో ఆమె పోలీసును ఆశ్రయించింది. కేసు నమోదు చేసిన పోలీసులు 10 మంది నిందితులను చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారని ఏసీపీ తెలిపారు. బుధవారం వీరిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. అరెస్ట్ చేసిన వారిలో మహమ్మద్ ఓవైసీ, ముత్యాల పవన్ కుమార్, బొద్దుల శివకుమార్, నూకల రవి, జెట్టి సంజయ్, ఎండి అబ్దుల్, పుస్తకాల సాయితేజ, ముత్తాడి సుమంత్‌రెడ్డి, గుండ సాయి చరణ్ రెడ్డి, ఓరుగంటి సాయిరామ్ ఉన్నారని వివరించారు. కేసును చేధించడంలో ప్రతిభ కనబరిచిన జనగామ సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్సైలు భరత్, చెన్నకేశవులును వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్, డీసీపీ రాజమహేంద్ర నాయక్ అభినందించారని ఏసీపీ తెలిపారు.

# ఘనంగా ఆలయ వార్షికోత్సవం



**చేర్యాల, మన చౌరాస్తా :** మండల కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయ అష్టమ వార్షికోత్సవ వేడుకను ఆలయ కమిటీ అధ్యక్షులు తాటిపెల్లి ఆంజనేయులు గుప్తా ఆధ్వర్యంలో బుధవారం కనులపండువగా ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని మామిడి తోరణాలతో పూలతో సుందరంగా అలంకరించారు. వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా తెల్లవారుజూమునుండే స్వామి వారి మూల విరాటుకు పంచామృతాభిషేకం నిర్వహించి, గణపతి హోమం, విశేష పుష్పాలంకరణ చేసి పూజలు నిర్వహించి లక్ష పుష్పార్చన మహా మంగళహారతి, ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆంజనేయులు గుప్తా మాట్లాడుతూ. అయ్యప్ప స్వామి అనుగ్రహంతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. భక్తులు పాల్గొని అయ్యప్ప నామస్మరణం, భజన పాటలు, భక్తి గీతాలను ఆలపించగా అందరిని అలరించాయి.

# నానితో శేఖర్ కమ్ముల మూవీ



టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులకి మంచి వినోదం పంచుతున్న విషయం తెలిసిందే. ఆయన తెరకెక్కించిన ప్రతి చిత్రం కూడా బాక్సాఫీస్ దగ్గర మంచి వసూళ్లే రాబట్టింది. ఇటీవల కుబేర అనే చిత్రంతో పలకరించాడు. ఈ మూవీ కూడా మంచి విజయం సాధించింది. ఇక ఇప్పుడు నానితో ఓ ప్రాజెక్ట్ చేయనున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. నేచురల్ స్టార్ నాని తన కెరీర్‌ను వైవిధ్యంగా మలుస్తున్నాడు. ప్రేమకథలతో, కుటుంబ డ్రామాలతో ప్రేక్షకుల మనసు దోచిన నాని, ఇటీవల 'హిట్ 3'లాంటి డార్క్ యాక్షన్ థ్రిల్లర్‌తో వైవిధ్యాన్ని చూపించాడు. ప్రస్తుతం శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో 'ది ప్యారడైజ్' చిత్రం చేస్తున్నాడు. ఈ మూవీ తర్వాత శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ఓ మూవీ చేయనున్నాడనే వార్త ఫిల్మ్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతోంది. ఇటీవలే 'కుబేర' మూవీతో మళ్లీ ఫామ్‌లోకి వచ్చిన శేఖర్ కమ్ముల, నానితో కలిసి ఎలాంటి కథను సినిమాగా తీయబోతున్నారా అనే ఆసక్తి పెరుగుతోంది. వీరిద్దరి కాంబినేషన్‌లో ఇది తొలి సినిమా కావడం, ఇద్దరికీ భిన్నమైన ఫాలోయింగ్ ఉండటంతో ఈ ప్రాజెక్ట్‌పై అప్పుడే హైప్ క్రియేట్ అయింది. ఈ మూవీలో హీరోయిన్‌గా సాయిపల్లవి పేరు వినిపిస్తుంది. ఇది నిజమైతే, ఇది నాని సాయిపల్లవి జోడీకి మూడో సినిమా అవుతుంది. గతంలో వీరిద్దరూ కలిసి నటించిన 'ఎంసీఏ' (2017), 'శ్యామ్ సింగరాయ్' (2021) మంచి విజయం సాధించాయి. ప్రేక్షకుల నుంచి హిట్ పెయిర్‌గా గుర్తింపు కూడా పొందారు. శేఖర్ కమ్ములకు సాయిపల్లవి ఫేవరెట్ హీరోయిన్. ఇద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'ఫిదా' ఆమెకు స్టార్‌డమ్ తీసుకొచ్చింది. ఆ తర్వాత 'లవ్‌స్టోరీ' కూడా మంచి స్పందన తెచ్చుకుంది. అయితే నాని శేఖర్ కమ్ముల ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందా అని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.




# నేడు థియేటర్లలోకి కూలీ

ఎప్పుడూ తన సినిమా సంగతులను పంచుకునే లోకేశ్ కనగరాజ్ వాటి విడుదలకు ముందు కచ్చితంగా పోస్ట్ పెడుతుంటారు. దీంతో 'కూలీ' విడుదలకు ముందు ఆయన పెట్టే పోస్ట్‌పై కొన్ని రోజులుగా అందరిలో ఆసక్తి నెలకొంది. ఆయన దర్శకత్వంలో రజనీకాంత్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'కూలీ'. నాగార్జున, ఆమిర్‌ఖాన్, సత్యరాజ్, శ్రుతిహాసన్, సౌబిన్ షాహిర్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఆగస్టు 14న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఆయన ఈ సినిమాను ఉద్దేశిస్తూ రజనీకాంత్‌కు థాంక్స్ చెబుతూ పోస్ట్ పెట్టారు. ఆయన వల్లే ఈ సినిమాపై ప్రేక్షకులు ఇంత ప్రేమ చూపుతున్నారని పేర్కొన్నారు. చిత్రీకరణకు సంబంధించిన ఫొటోలను పంచుకున్నారు. నా సినీ ప్రయాణంలో 'కూలీ'కి ఎప్పుడూ ప్రత్యేక స్థానం ఉంటుంది. ఈ సినిమా ఇంత బాగా రావడానికి, దీనిపై ఇంత మంది ప్రేమ చూపించడానికి కారణం తలైవానే. నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు ఆయనకు ఎప్పటికీ కృతజ్ఞతతో ఉంటా. 'కూలీ' చిత్రీకరణలో ఎన్నో మధురక్షణాలు ఉన్నాయి. వాటిని ఎప్పటికీ నా మనసులో దాచుకుంటాను' అని తెలిపారు. రజనీకాంత్ ఇండస్ట్రీక్రి వచ్చి మరో రెండు రోజుల్లో 50ఏళ్లు పూర్తి కానున్న సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఎంతో మందిలో స్ఫూర్తినింపుతున్నందుకు కృతజ్ఞతలు చెప్పారు. అపూర్వ రాగంగల్'తో రజనీకాంత్ ఇండస్ట్రీల్రోకి అడుగు పెట్టారు. 1975 ఆగస్టు 15న ఈ సినిమా విడుదలైంది. మరో రెండు రోజుల్లో దీనికి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా సోషల్ మీడియాలో శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. తలైవాకు కంగ్రాట్స్ చెబుతూ సినీ ప్రముఖులు పోస్ట్‌లు పెడుతున్నారు. నటుడిగా నేను మొదటి సినిమా మీతోనే చేశా. నా గురువులలో మీరూ ఒకరు. ఎంతో మందిలో స్ఫూర్తి నింపుతున్నందుకు ధన్యవాదాలు. మీరు మరిన్ని సినిమాలతో అలరించాలని కోరుకుంటున్నాను అని హృతిక్ రోషన్ అన్నారు. ఒక మనిషి.. ఒక కిరీటం.. 50 సంవత్సరాలు. ఈ గోల్డెన్ జూబ్లీని 'కూలీ'తో సెలబ్రేట్ చేసుకుందాం సంగీత దర్శకుడు అనిరుధ్ అన్నారు.




# పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై ముంబై సంస్థ కేసు

## రాజసాబ్ విడుదలపై ప్రభావం

టాలీవుడ్ బడా నిర్మాణ సంస్థపై కేసు నమోదయింది. తమను మోసం చేసారని పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై ముంబైకి చెందిన ఐవివై ఎంటర్‌టెన్‌మెంట్స్ కేసు పెట్టింది. వివరాలలోకెళితే పీపుల్స్ మీడియా సంస్థ నిర్మాణంలో రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా రాజాసాబ్ అనే సినిమాను నిర్మిస్తోంది. అత్యంత భారీ బడ్జెట్ పై చాలా కాలంగా ఈ సినిమాను నిర్మిస్తోంది పీపుల్స్ మీడియా. అయితే వందల కోట్ల బడ్జెట్ తో పీపుల్స్ మీడియా నిర్మిస్తున్న ఈ సినిమాకు ముంబై కు చెందిన ఈ సంస్థ ఆర్థిక భాగస్వామిగా వ్యవహరిస్తోంది. సినిమా షూటింగ్ కు అయ్యే ఖర్చు తదితర వాటికి ఆర్థిక వనరులు సమకూర్చేలా ఇరు సంస్థలు ఒప్పందాలు చేసుకున్నాయి. గ్రాండ్‌గా షూటింగ్ స్టార్ట్ చేసిన పీపుల్ మీడియా మేకర్స్ ఈ సినిమా షూటింగ్ ను అనుకున్న టైమ్ లో ఫినిష్ చేయలేక పోయారు. ఇప్పటికే రాజాసాబ్ అనేకసార్లు రిలీజ్ వాయిదా పడుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో పీపుల్ మీడియా తమ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని, సినిమా షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయజేకుండా, తమకు ఎలాంటి సమాచారం అందించడం లేదని, మేము ఇచ్చిన డబ్బులు ఎలా ఉపయోగించారనే దానిపై వివరణ కూడా వివరన ఇవ్వలేదని చెబుతూ ఢిల్లీకోర్టులో కేసు నమోదు చేసింది. అలాగే మేము ఇచ్చిన డబ్బులో ప్రస్తుతం రూ. 218 కోట్లు- తిరిగి ఇవ్వాలని ఈ సంస్థ డిమాండ్ చేస్తోంది. ఇదిలా ఉండగా ఈ సినిమా ఇంకా నాన్-థియేట్రికల్ డీల్‌ను క్లోజ్ కాలేదని, అనుకోని కారణాల వలన రిలీజ్ వాయిదా వేసామని కావాలని తమ పరువుకు భంగం కలిగింస్తున్నారని ఐవివై సంస్థపై పీపుల్స్ మీడియా కోర్టును ఆశ్రయించింది.